# ★ ప్రాయశ్చిత్తము

శ్రీ తూమాటి గాంధి

★

"ఒరే రాముడూ! ఓరి రాముడూ!" అని కేక వేస్తున్నాడు— ఏదో పెద్దప్రళయం వచ్చినట్టుగా, తెల్లవారుఝామున 4 ఘంటలప్పుడు మాలపల్లెలో చౌదరమ్మగారు— రాముడియింటిముందు నిలబడి. రెండుసార్లు పిలిచినా జవాబురాకపోవడం, చౌదరమ్మగారికి ఆగ్రహాన్ని కలిగించింది. పైగా చలికూడ జాస్తిగావుంది చలికాలం కాబట్టి. మళ్లీ కేకవేశాడు "రామిగా" అని.

"లేడండి దొరగారు! పనిలోకెళ్లాడు" అని దీనంగా జవాబు వచ్చింది.

"ఇంత తెల్లారెళ్లాడూ! పనిలోకి?"

"అప్పుడే తెల్లవారిందండీ! దొరగారూ?"

"తెల్లారలే? యింట్లో మంచం కుక్కిమీదపడి వుంటే పొద్దం తెలుస్తుందీ."

"మీకేంబాబయ్యా—! మేడలున్నయి. మిద్దెలున్నయి. గుడ్డలున్నయి— గుడుసులున్నయి— హాయిగా కప్పుకుంటారు. పడుకుంటారు. మాకెక్కడినుంచి వొస్తయ్? యిల్లు, పైకప్పు, అంతా లేచిపోయింది. యింట్లో పడుకుంటేనే చలి. ఇంక బయటికిపోతే ఎలా వుంటుందో చెప్పండీ! "చలిచలి" అంటూ ఇంతకుముందే లేచి పనిలోకెళ్లాడండీ మాఅయ్య"

"మంచిది" అని చౌదరమ్మగారు ముందుకుజరిగి ఆమాట్లాడే మనిషి ముఖంమీద బ్యాటర్ లైటు వేశాడు.

లచ్చి గప్పున కండ్లుమూసికొంది. మాలపిల్లఅయితేనేం! ఆ నయనాలు, ఆ చెక్కిళ్లు, ఆ కనుబొమలు ఆముఖానికి అసమాన సౌందర్యాన్ని కలిగిస్తున్నవి. ఆ చింపిరితల సహితం ఆముఖానికి అందాన్ని కలిగిస్తోంది. ఏముందిపాపం! తండ్రి కూలి తెస్తేనేగాని యింట్లోపూట జరుగదు. కూలిలేకపోతే పస్తు. పైగా చిన్నతనాన్నే తల్లికాస్తా మృతినొందింది. సరిగా తింటానికి తిండీ, కట్టడానికి బట్టసహితం, చిన్నప్పటినుంచి లచ్చికి దూరంగానేవున్నయి. కాని యేంజేస్తుంది పాపం! ఏదో తండ్రి తెచ్చిన సోలెడుతోనే సంసారాన్ని నెట్టుతోంది. నెత్తికి చమురులేక తలవెంట్రుకలన్నీ ఎర్రబారిపోయినవి. ఆ గాఢాంధకారపు చీకటిలో ఆలైటు వెలుగున లచ్చి ఒక మెరుపుతీగలాగా, మెరిసింది.

"లచ్చీ! రోజూ నేనిలారావడం దేనికనుకొన్నావ్?"

"..........................."

"ఇంత చలినిగూడా లెక్కచెయ్యకుండా వచ్చాను. ఎందుకూ రోజూ యిలా!"

"బాబయ్యా............"

"అదిగో మరచాను. ఏంటి యిందాకన్నావు! గుడ్డలు లేవన్నావుగదూ. ఏం గుడ్డలుకావాలి చెప్పు. రేపు తెల్లవారేటప్పటికి తెప్పిస్తాను. ఇదిగో నేనుండంగా నీకేంకొరవ! వెధవ గుడ్డలేమిటీ! యింకా...... చూడూ! యింటికప్పుపోతే నాకు ఒక్కసారిగూడా చెప్పలేదేం యిన్నిరోజులనుంచి! దాందేంత, రేపు మధ్యాహ్నానికి బెంగుళూరు పెంకు కప్పిస్తానుండు."

"యీగుడిసె చాల్లేండి దొరగారూ!"

దగ్గరకు జరుగుతాడు. లచ్చిభయంతో వెనక్కి నక్కుతుంది.

"క్షమించండి! దొరగారూ!"

"అబ్బే! ఎందుకు లచ్చీ అంతమాట. ఇంకా నన్నే క్షమించాలి నీవు" మరీ దగ్గరకు వెళ్లుతాడు.

"దూరంగావుండండి దొరగారూ! ఏదో నేను మాలదాన్ని మీరు సంసా......"

"ఇక్కడ మాలేమిటి! సంసారేమిటి! అవన్నీ వీధిలోనే"

"దండం పెడతానండీ దొరగారూ! మీకు పెద్దలకు యిది పనిగాదు."

"ఫరవాలేదులే! నీకేంభయంలేదు. ఇదిగో కావాలంటే యీ మాలపల్లెనంతటినిగూడా ఒక్క క్షణంలో భస్మం చేసేస్తాను! తెలుసా"

"దయయుంచండి! బాబయ్యగారూ! నేను..."

"సిగ్గుపడకు! చెప్పు లచ్చీ. ఏంటీ! నీవు..."

"నేను పెండ్లికావాల్సిన పిల్లను. నన్నిట్లు బలత్కారం చెయ్యడం..."

"ఇది నీ పెండ్లికేం అడ్డమొస్తుందీ! ఎవరు చూస్తారు కనుక! యిస్! అబ్బ తెల్లవారొచ్చింది. ఎవరైనవస్తారు" చెయ్యిపట్టుకొనును.

"దయయుంచండి దొరగారూ! మీ పాదాలకు మొక్కుతాను" అని చెయ్యివిడిపించుకొని వెనుకకు జరుగును.

"ఆ! నేను— ఇంతటీవాణ్ణి— యీఝామున నీయింటికివస్తే— అని లచ్చిమీదకు అమాంతం ధిక్కారం సైతునా! అనే పోజులో పోవును.

లచ్చి కెవ్వుమని కేకవేసి మంచపు ఠుక్కులో పడును. చౌదరమ్మగారు బలవంతంగా లచ్చిస్తనాన్ని గట్టిగా నొక్కును. లచ్చి భయకంపిత స్వరంతో "అమ్మా" అని కేకవేయును.

ఇంతలోపల బయటనుండి "లచ్చీ లచ్చీ" అను కేకలు వినబడును. చౌడరమ్మ భయకంపితుడై లచ్చిని కాలితో తన్ని బయటికి పరుగెత్తి గుడిసెచాటున వెనుకభాగంలో నక్కుతాడు.

రాముడు లచ్చి అంటే పంచప్రాణాలు వదుల్తాడు. ఆ తల్లిలేనిబిడ్డ ఒక్కటే రామునికి యీలోకం ఆధారం. చలి ఎక్కువగా వుంటంచేత తన ముసలి కోటు చాలక దుప్పటిగూడా తీసుక వెళుదామని రాముడు తిరిగివస్తున్నాడు. లచ్చి "అమ్మా" అని కేక వెయ్యడం విన్నాడు. మరీ తొందరగా గుడిసెలో దూరాడు.

"లచ్చీ! ఎందుకమ్మా "అమ్మా" అని కేకాశావు అని ఆతురతతో అడిగాడు రాముడు. లచ్చి మెల్లగా కష్టంమీదలేచి నిలువబడింది.

"ఏంలేదయ్యా! వూరకనే అన్నాను."

"కాదులే చెప్పుతల్లీ! నీకన్నా నాకేవరున్నారీ పాడులోకంలో! నీకు కష్టమొస్తే నాకొచ్చినట్లుగాదమ్మా! చెప్పమ్మా"

"ఏంలేదయ్యా! అమ్మ మరుపుకు వచ్చింది. "అమ్మా" అన్నాను. అంతే"

"ఏంచేద్దాము! లచ్చీ! దేవుడి యిష్టప్రకారం జరుగాల్సిందేనా! ఇప్పటికి సరిగా ఆరేండ్లు కావచ్చింది. నిన్ను నన్ను ఏకాకులను చేసిపోయింది" అని గాఢమైన నిట్టూర్పు వదలును.

"సరేగానీ. మళ్లీవచ్చావెందుకయ్యా నీవు"

"చలి ఎక్కువుగావుంది! నాదుప్పటి యిలా తేమ్మా"

లచ్చి దుప్పటితెచ్చి యిచ్చును. రాముడు కప్పుకొంట్డాడు.

"పండుకోమ్మా! అప్పుడే తెల్లవార్లేదు" అని రాముడు వెళ్లిపోవును.

చౌదరమ్మగారు గుడిసెచాటున నిలబడి విన్నాడు తండ్రి కుమార్తెల సంభాషణ. తనకుమార్తె తల్లిలేని కాంత జ్ఞాపకానికి వచ్చింది. అతని హృదయం నీరైపోయింది. అమాంతంపోయి లచ్చికాళ్లకు మ్రొక్కుదామనుకొన్నాడు తానుచేసిన తప్పుకు. తిరిగి గుడిసెవైపు వచ్చాడు.

"లచ్చీ, యీ దుర్మార్గుణ్ణి క్షమించు"

లచ్చి ఆశ్చర్యంతో "మిమ్ములను,— గొప్పవారిని— నేనా— క్షమించేది"—అంది.

"నన్ను మనస్ఫూర్తిగా క్షమించు. మహాపరాధం చేశాను"

"గొప్పవారు. అలాంటిమాటలనకండి—తప్పు"

చౌదరమ్మ ఖిన్నుడై యింటివైపు తిరిగాడు.


# శక్తిమయా

శక్తి ♦ పటుత్వం ♦ ఉత్సాహం ♦
ఇస్తుంది

అన్ని మందులషాపుల్లో దొరుకుతుంది.

## సూరజ్ ఫార్మసీ,

1/90, తిరువత్తియూరు హైరోడ్డు,
చాకలపేట, మద్రాసు.